## వర్షాభావ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటలు తప్పనిసరి

**- జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.విజయచంద్ర**



**తొలి సమయం మహబూబాబాద్ జూలై 16**

పర్వతగిరి రెవెన్యూ పరిధిలోని సొమ్లతండా గ్రామపంచాయతీలో గ్రామ సర్పంచి ఆధ్వర్యంలో వర్షాభావ పరిస్థితులలో ప్రత్యామ్నాయ పంటలపై జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ విజయచంద్ర రైతులకు అవగాహన కల్పించడం జరిగింది. జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ శాఖ మరియు నీటిపారుదల శాఖ అధికారులచే గ్రామస్థాయిలో నీటి లభ్యత, భూగర్భ జలాలు, వర్షపాతం ఆధారంగా వివిధ పంటలపై రైతులకు అవగాహన కల్పించారు. వాతావరణం వచ్చే మార్పులు ఎల్నినో నేపథ్యంలో రైతులు అధిక నీటి అవసరం ఉన్న వరి పంట బదులు ప్రత్యామ్నాయ పంటలైన పెసర, మినుము, రాగి, కందులు, జొన్నలు ,కూరగాయలువంటి పంటలు సాగు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి విజయచంద్ర తెలిపారు. వరికి బదులు ఆయిల్ ఫామ్, మల్బరీ ,నిమ్మగడ్డి వంటి అధిక ఆదాయాన్నిచ్చే పంటలను సాగు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మా రెడ్డి తిరుపతిరెడ్డి, నీటిపారుదల శాఖ ఏఈ కళ్యాణ్ ,ఏఈఓ షహనా బేగం, గ్రామ సర్పంచ్ సుజాత బాలాజీ నాయక్, రైతులు పాల్గొన్నారు.

## ఆదివాసీ రైతు పంట ధ్వంసం..
## గిరిజనేతరులపై చర్యలు తీసుకోవాలని
## తుడుం దెబ్బ డిమాండ్

**తొలి సమయం కొత్తగూడ 16 జూలై 2026**



గంగారం మండలం దుబ్బగూడెం గ్రామానికి చెందిన ఆదివాసీ నిరుపేద రైతు సువర్ణపాక పాపారావుకు చెందిన (అటవీ హక్కుల చట్టం) పట్టా కలిగిన వ్యవసాయ భూమిలో సాగు చేసిన మొక్కజొన్న, వరి పంటలను కొందరు గిరిజనేతరులు ధ్వంసం చేసిన ఘటన స్థానికంగా కలకలం రేపింది.బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం, మామిడిగూడెం గ్రామానికి చెందిన సుమారు 30 మంది గిరిజనేతరులు వ్యవసాయ భూమిలోకి ప్రవేశించి పంటను ధ్వంసం చేశారని ఆరోపించారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులు విచారణ చేపట్టినట్లు సమాచారం.ఘటన స్థలాన్ని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) గంగారం మండల అధ్యక్షుడు పెనక వెంకన్న పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతంలో చట్టబద్ధమైన హక్కులు కలిగిన ఆదివాసీ రైతు పంటను ధ్వంసం చేయడం అత్యంత దురదృష్టకరమని అన్నారు.పంటను ధ్వంసం చేసిన వారిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోకపోతే తుడుం దెబ్బ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ప్రస్తుతం ఈ ఘటనపై అధికారులు విచారణ కొనసాగిస్తున్నారు.

## రేపు మూడు కేజీబీవీల్లో ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు

**మహబూబాబాద్ జిల్లాలో ఖాళీ సీట్ల భర్తీకి అవకాశం..**

**అర్హులైన విద్యార్థినులు హాజరు కావాలి**

**తొలి సమయం మహబూబాబాద్ 16 జూలై 2026**



మహబూబాబాద్ జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల (కేజీబీవీ) పరిధిలోని యంగ్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎక్సలెన్స్ జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న ఇంటర్మీడియట్ సీట్ల భర్తీ కోసం జూలై 17న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు జిల్లా జీఈసీవో గాయత్రి తెలిపారు.జిల్లాలోని మూడు కేజీబీవీల్లో మొత్తం 45 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. వాటిలో మహబూబాబాద్ కేజీబీవీలో బైపీసీ గ్రూపులో 16 సీట్లు, గూడూరు కేజీబీవీలో ఎంపీసీ గ్రూపులో 15 సీట్లు, బయ్యారం కేజీబీవీలో సీఈసీ గ్రూపులో 14 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.ఎస్సెస్సీ ఉత్తీర్ణులైన అర్హులైన విద్యార్థినులు అవసరమైన ధ్రువపత్రాలతో జూలై 17 ఉదయం 10 గంటలకు సంబంధిత కేజీబీవీ జూనియర్ కళాశాలలకు హాజరై స్పాట్ అడ్మిషన్ ప్రక్రియలో పాల్గొనాలని ఆమె సూచించారు. ఖాళీ సీట్లను అర్హత, నిబంధనల మేరకు భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు.

## క్షుద్ర పూజల కలకలం..
## భయాందోళనలో రెండు గ్రామాల ప్రజలు



**తొలి సమయం ములుగు 16 జూలై 2026**

ములుగు మండలంలోని కన్నాయిగూడెం, కాసిందేవిపేట గ్రామాల పొలిమేర ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తులు నిత్యం క్షుద్ర పూజలు నిర్వహించిన దృశ్యాలు స్థానికంగా కలకలం రేపుతోంది. దీంతో ఈ రెండు గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. గ్రామస్తుల కథనం ప్రకారం, రాత్రి వేళల్లో పొలిమేర ప్రాంతంలోని మూడు రహదారులు కలిసే చోట నల్లటి కోడి అవశేషాలు, బొగ్గుతో తయారుచేసిన నల్లటి ముద్దలు, కుంకుమతో చేసిన ఎర్రటి ముద్దలు, నిమ్మకాయలు, మిరపకాయలు, జీడిగింజలు, పసుపు, కుంకుమ వంటి వస్తువులు కనిపంచాయి . దీంతో మహిళలు, రైతులు, చిన్నారులు రాత్రి సమయంలో అత్యవసర పనుల నిమిత్తం బయటకు వెళ్లేందుకు కూడా భయపడుతున్న పరిస్థితి నెలకొంది.ఏజెన్సీ ప్రాంతంలోని ఈ గ్రామాల్లో రాత్రి వేళల్లో కొందరు క్షుద్ర పూజలు నిర్వహిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు దృష్టి సారించి, వాస్తవాలను పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని, అలాగే మూఢనమ్మకాలను ప్రోత్సహించే చర్యలను అరికట్టాలని రెండు గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ముత్యాలమ్మ ఆలయానికి విద్యుత్ వెలుగులు..

**- ఎన్నికల హామీని నిలబెట్టుకున్న సర్పంచ్ సునీత**



**తొలి సమయం కొత్తగూడ 16 జూలై 2026**

గూడూరు మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని ముత్యాలమ్మ ఆలయానికి విద్యుత్ సౌకర్యం కల్పిస్తూ గ్రామ సర్పంచ్ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. రాబోయే ముత్యాలమ్మ బోనాల పండుగను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి, విద్యుత్ లైన్ వేయించే పనులను చేపట్టారు.ఈ కార్యక్రమం మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్ చొరవతో చేపట్టబడగా, గూడూరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ వాంకుడోత్ సునీత కొమ్మాలు నాయక్ ఆధ్వర్యంలో పనులు కొనసాగుతున్నాయి. బోనాల పండుగకు ముందే ఆలయంలో విద్యుత్ దీపాల ఏర్పాటును పూర్తి చేసి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.ఈ కార్యక్రమంలో గూడూరు మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బీరం శ్రీపాల్ రెడ్డి, ఉపసర్పంచ్ చంటి స్వామి, వార్డు సభ్యుడు ధరావత్ కిషన్, మండల యూత్ కాంగ్రెస్ నాయకుడు షాజహాన్, కాంగ్రెస్ నాయకుడు సునీల్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## వర్షాభావంలో ప్రత్యామ్నాయ పంటలతోనే రైతులకు భరోసా

**- మండల వ్యవసాయ అధికారి మహమ్మద్ అబ్దుల్ మాలిక్**

**తొలి సమయం కొత్తగూడ 16 జూలై 2026**



గూడూరు మండలంలోని బొల్లేపల్లి గ్రామంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులకు ప్రత్యామ్నాయ పంటలు, పంట మార్పిడి విధానాలు, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మహమ్మద్ అబ్దుల్ మాలిక్ మాట్లాడుతూ, ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు చేపడితే నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు.అలాగే పంట మార్పిడి విధానాన్ని పాటించడం వల్ల భూసారం పరిరక్షించబడటమే కాకుండా, పంటల దిగుబడి మరియు రైతుల ఆదాయం కూడా పెరుగుతుందని ఆయన వివరించారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలను పాటిస్తూ శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని కోరారు.ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సేవలు, వర్షాభావ పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సమగ్ర పంట నిర్వహణపై కూడా రైతులకు ఆయన అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా రైతులకు పెసర్లు, కందులు, మినుములు, బొబ్బర్లు, జొన్నలు వంటి తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి వినయ్, గ్రామ సర్పంచ్ బానోతు మహేష్, ఉపసర్పంచ్ హరి, రైతులు మరియు గ్రామ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రమాద బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



**తొలి సమయం, ఇల్లందు;జూలై, 16:**

కొల్లాపురం గ్రామానికి చెందిన పాయం సురేష్ కుటుంబానికి ది గాడ్ థెరిస్సా మహిళా మండలి ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులతో పాటు రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.గతకాలం క్రితం పాయం సురేష్ తన ద్విచక్ర వాహనంపై బంధువుల వివాహానికి వెళ్తుండగా కరెంట్ ఆఫీస్‌పెట్రోల్ బంక్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన భార్య మృతి చెందగా, సురేష్ ఒక కాలును కోల్పోయారు. ఆయన కుమారుడు సాత్విక్ రెండు కాళ్లను కోల్పోయాడు. ఈ కుటుంబం తీవ్ర ఆర్థిక, సామాజిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న మహిళా మండలి సభ్యులు వెంటనే స్పందించారు.సంస్థ అధ్యక్షురాలు ఆవుల నాగరాణి, షేక్ కతీజా బేగం, బుడిగ ఉమా సూచనల మేరకు సంస్థ మేనేజర్ వెంకటేశ్వర్లు, భవాని రాణి తదితర సిబ్బంది కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించి నిత్యావసర సరుకులు మరియు రూ.10 వేల నగదు సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్, ఎమ్మెల్యే కోరం కనకయ్య దృష్టికి ఈ కుటుంబ పరిస్థితిని తీసుకెళ్లి, సురేష్ కుమారుడు సాత్విక్‌కు కృత్రిమ కాళ్లు అమర్చేందుకు, అలాగే కుటుంబానికి జీవనోపాధి కల్పించేలా ప్రభుత్వ పరంగా అవసరమైన సహాయం అందించాలని కోరనున్నట్లు మహిళా మండలి ప్రతినిధులు తెలిపారు. బాధిత కుటుంబానికి తమ వంతు సహాయం ఎల్లప్పుడూ కొనసాగుతుందని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ది గాడ్ థెరిస్సా మహిళా మండలి అధ్యక్షురాలు ఆవుల నాగరాణి, షేక్ కతీజా బేగం, బుడిగ ఉమా, సంస్థ మేనేజర్ వెంకటేశ్వర్లు, భవాని రాణి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని ఎంపిక



**తొలి సమయం కొత్తగూడ 16 జూలై 2026**

గూడూరు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల , లీగలవేణికి చెందిన 8వ తరగతి విద్యార్థిని మిటపెల్లి ప్రీతిక తెలంగాణ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ ఏ ఫారూఖ్ తెలిపారు.ఈ నెల 14న మహబూబాబాద్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి అండర్-14 అథ్లెటిక్స్ ట్రయల్స్లో మిడిల్ డిస్టెన్స్ విభాగంలో ప్రీతిక ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించిందన్నారు.ఈ నెల 18వ తేదీన మెదక్‌లోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరగనున్న తెలంగాణ రాష్ట్రస్థాయి మిడిల్ డిస్టెన్స్, లాంగ్ డిస్టెన్స్ అథ్లెటిక్స్ పోటీల్లో ప్రీతిక పాల్గొననుందని అన్నారు.ఈ సందర్భంగా రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థిని మిటపెల్లి ప్రీతికను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.ఏ. ఫారూఖ్, పీడీ గొల్లపూడి రాణి, ఉపాధ్యాయ బృందం, గ్రామ సర్పంచ్ దారావత్ రాజు అభినందించి, రాష్ట్రస్థాయిలోనూ ఉత్తమ ప్రతిభ కనబర్చి పాఠశాల, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## శివ చరణ్ రెడ్డి వ్యాఖ్యలను ఖండించిన ఇల్లందు యాదవ సంఘం



**తొలి సమయం, ఇల్లందు;జులై, 16:**

ఇల్లందు యాదవ సంఘం పట్టణ కమిటీ సమావేశం గురువారం ద్వారకా నగర్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో యాదాద్రి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలిగా నియమితులైన శ్రీమతి పోతాబోయిన ఈశ్వరమ్మ యాదవ్‌పై ఇటీవల జక్కడి శివ చరణ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను యాదవ సంఘం నాయకులు తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈశ్వరమ్మ యాదవ్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు యాదవ సమాజాన్ని అవమానించే విధంగా ఉన్నాయని ఆరోపించారు. జక్కడి శివ చరణ్ రెడ్డి తక్షణమే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న యాదవులు ఐక్యంగా ఉద్యమించి ఆయన రాజకీయ ప్రస్థానానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.ఈ సమావేశంలో ఇల్లందు యాదవ సంఘం పట్టణ అధ్యక్షుడు మేకల మల్లేష్ యాదవ్, భయ్యా వరప్రసాద్ యాదవ్, కళాశాల శ్రీనివాస్ యాదవ్, పెరుగు కోటేశ్వరరావు యాదవ్, వంగపండ్ల నాగరాజు యాదవ్ ,మద్ది మల్లేష్ యాదవ్, పెరుమల్ల శీను యాదవ్, రాజలింగం యాదవ్, కృష్ణ యాదవ్, వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## సీతక్క అడుగుజాడల్లో.. రూప్‌సింగ్ రాజకీయ విజయాలు

**నాడు ఎంపీటీసీగా అవకాశం..**

**నేడు మండల కాంగ్రెస్ పగ్గాలునమ్మిన నాయకుడికి కీలక బాధ్యత..**

**విధేయతకు దక్కిన గుర్తింపు**

**తొలిసమయం,కొత్తగూడ: జూలై 16 2026**

ఆయన రాజకీయ ప్రస్థానానికి తొలి అడుగు సీతక్కతోనే.. ప్రజాప్రతినిధిగా అవకాశం ఆమె ఆశీస్సులతోనే.. కుటుంబానికి రాజకీయ గుర్తింపు ఆమె అండతోనే.. ఇప్పుడు మండల కాంగ్రెస్ పగ్గాలు సైతం ఆమె నమ్మకంతోనే దక్కాయి. దాదాపు సుదీర్ఘకాలంగా మంత్రి దనసరి అనసూయ సీతక్కను రాజకీయ గురువుగా భావిస్తూ, ఆమె వెంటే నడిచిన బానోత్ రూప్‌సింగ్‌కు కొత్తగూడ మండల కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలు దక్కాయి.రాజకీయాల్లో పరిస్థితులు మారుతుంటాయి.. పార్టీలు మారుతుంటాయి.. పదవులు వస్తుంటాయి.. పోతుంటాయి. కానీ రూప్‌సింగ్ రాజకీయ ప్రయాణంలో మాత్రం ఒకటి మారలేదు. అదే సీతక్కపై నమ్మకం. సీతక్క తెలుగుదేశం పార్టీలో ఉన్న రోజుల నుంచే ఆమె వెంటే రూప్‌సింగ్ రాజకీయ అడుగులు వేశారు. కష్టకాలంలోనూ ఆమెను వీడలేదు. గెలుపులోనూ, ఓటమిలోనూ వెన్నంటి నిలిచారు. సీతక్క కాంగ్రెస్‌లోకి అడుగుపెట్టినప్పుడు రూప్‌సింగ్ సైతం ఆమెతోనే కొత్త ప్రయాణం ప్రారంభించారు. పార్టీ మారింది తప్ప.. నాయకురాలిపై ఆయనకున్న నమ్మకం మారలేదు.

**సీతక్క ఆశీస్సులతో తొలి విజయం**

కొత్తగూడ మండలంలోని రేణ్యాతండాకు చెందిన బానోత్ వెంకట్రావుకాంతమ్మ దంపతుల కుమారుడు రూప్‌సింగ్. యువకుడిగా ఉన్నప్పటి నుంచే ప్రజాసేవపై ఆసక్తితో రాజకీయాల్లోకి వచ్చారు. ఆయనలోని నాయకత్వ లక్షణాలను గుర్తించిన సీతక్క.. జంగవానిగూడెం ఎంపీటీసీ స్థానం నుంచి రాజకీయ అవకాశం కల్పించారు. ఆమె ఆశీస్సులతో బరిలో నిలిచిన రూప్‌సింగ్ ప్రజల మద్దతుతో విజయం సాధించి తొలిసారి ప్రజాప్రతినిధిగా ఎన్నికయ్యారు.

**ఆ విజయం రూప్‌సింగ్ రాజకీయ జీవితంలో తొలి మైలురాయిఅయితే..దానికిదారిచూపిందిసీతక్క నాయకత్వమే**

**పార్టీ మారినా.. నాయకురాలు మారలేదు**

కాలక్రమంలో రాజకీయ పరిణామాలు మారాయి. సీతక్క తెలుగుదేశం పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. అప్పుడు రూప్‌సింగ్ సైతం మరో ఆలోచన లేకుండా ఆమె వెంటే కాం



గ్రెస్ గూటికి చేరారు. ఆయనకు పార్టీ కంటే తాను నమ్మిన నాయకురాలితో రాజకీయ ప్రయాణమే ప్రధానమైంది.

**సీతక్క అధికారంలో ఉన్నప్పుడు మాత్రమే కాదు..**

రాజకీయంగా సవాళ్లు ఎదురైన సమయంలోనూ రూప్‌సింగ్ ఆమె వెంటే నిలిచారు. ఇదే ఆయనకు సీతక్క వద్ద ప్రత్యేక నమ్మకాన్ని తెచ్చిపెట్టిందని పార్టీ శ్రేణులు చెబుతున్నాయి.

**కుటుంబానికి సీతక్క అండ**

తదుపరి ఎన్నికల్లో జంగవాని గూడెం ఎంపీటీసీ స్థానం మహిళకు రిజర్వు కావడంతో రూప్‌సింగ్ తన భార్య విజయను బరిలో నిలిపారు. ప్రజల మద్దతుతో ఆమె విజయం సాధించారు. అనంతరం సీతక్క అండతో విజయ ఎంపీపీగా ఎన్నికయ్యారు. రూప్‌సింగ్‌కు రాజకీయంగా తొలి అవకాశం ఇచ్చింది సీతక్కే.. ఆయన భార్య విజయకు మండల పరిషత్ పగ్గాలు దక్కడంలోనూ ఆమె మద్దతే కీలకమైంది.. ఇప్పుడు రూప్‌సింగ్‌కు మండల కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలు దక్కడంలోనూ సీతక్క నమ్మకమే ప్రధాన బలంగా నిలిచింది.నమ్మినవారిని మరవని సీతక్క సీతక్క రాజకీయ ప్రయాణంలో తన వెంట కష్టకాలంలో నడిచిన వారిని గుర్తుపెట్టుకుంటారనే పేరు ఉంది. పదవులు లేని సమయంలో తనతో నడిచిన వారిని.. కష్టాల్లో వెన్నంటి నిలిచిన కార్యకర్తలను మరవకుండా అవకాశాలు కల్పిస్తారనే అభిప్రాయం ఆమె అనుచరుల్లో ఉంది.రూప్‌సింగ్ నియామకం కూడా అదే కోవలోకి వస్తుందని కాంగ్రెస్ శ్రేణులు పేర్కొంటున్నాయి. ఏళ్ల తరబడి తన వెంటే నడిచిన రూప్‌సింగ్ విధేయతను గుర్తించిన సీతక్క.. ఆయనపై ఉంచిన నమ్మకానికి మండల అధ్యక్ష బాధ్యత రూపంలో గుర్తింపు లభించిందని చెబుతున్నారు. తనను నమ్మిన వారిని సీతక్క మరవరు.. సీతక్కను నమ్మినవారు రాజకీయంగా ఒంటరి కారు.. అనే మాటకు రూప్‌సింగ్ రాజకీయ ప్రయాణమే నిదర్శనంగా నిలుస్తోందని ఆయన అనుచరులు అంటున్నారు.

నాడు ఆమె వెంట కార్యకర్తగా.. నేడు మండల సారథిగా ఒకప్పుడు సీతక్క వెంటే సాధారణ కార్యకర్తగా అడుగులు వేసిన రూప్‌సింగ్.. ఆమె ఆశీస్సులతో ఎంపీటీసీగా ఎదిగారు. ఆయన భార్య విజయ ఎంపీపీగా బాధ్యతలు చేపట్టారు. ఇప్పుడు రూప్‌సింగ్ కొత్తగూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియమితులయ్యారు.టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ ఈ మేరకు నియామక ప్రకటన విడుదల చేశారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, మంత్రి సీతక్క,



డీసీసీ అధ్యక్షురాలు భూక్య ఉమ, ములుగు డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, మాజీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్యకు రూప్‌సింగ్ కృతజ్ఞతలు తెలిపారు.సీతక్క నమ్మకమే.. తన బలమంటున్న రూప్‌సింగ్‌కొత్తగూడ మండలంలో ప్రతి కార్యకర్తను కలుపుకొని కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తానని రూప్‌సింగ్ పేర్కొన్నారు. సీతక్క తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, ప్రజల సమస్యల పరిష్కారానికి ముందుండి పనిచేస్తానని తెలిపారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ విజయమే లక్ష్యంగా కృషి చేస్తానని స్పష్టం చేశారు.రూప్‌సింగ్ రాజకీయ ప్రయాణంలో ప్రతి మలుపులోనూ సీతక్క కనిపిస్తారు. తొలి అవకాశం నుంచి తొలి విజయం వరకు.. కుటుంబానికి రాజకీయ గుర్తింపు నుంచి నేటి మండల అధ్యక్ష బాధ్యత వరకు.. ఆయన రాజకీయ ప్రస్థానానికి సీతక్క అండగా నిలిచారు. అందుకే రూప్‌సింగ్‌కు దక్కిన ఈ పదవి కేవలం ఒక రాజకీయ నియామకం మాత్రమే కాదు.. నమ్మిన నాయకుడికి సీతక్క ఇచ్చిన గుర్తింపుగా కాంగ్రెస్ శ్రేణులు భావిస్తున్నాయి.ఈ కథనంలో తనను నమ్మిన వారిని సీతక్క మరవరు.. సీతక్కను నమ్మినవారు రాజకీయంగా ఒంటరి కారు“ అనే లైన్ ప్రజల్లో బలంగా వెళ్లే అవకాశం ఉంది. అలాగే రూప్‌సింగ్ రాజకీయ ప్రయాణంలో ప్రతి మలుపులోనూ సీతక్క కనిపిస్తారు“ అనేది కథనానికి మంచి ముగింపు పంచ్ ఇస్తుంది.

## సుదిమల్ల గ్రామపంచాయతీలో విస్తృత పారిశుద్ధ్య కార్యక్రమం



**తొలి సమయం, ఇల్లందు;జూలై, 16:**
సీజనల్ వ్యాధుల నివారణతో పాటు గ్రామాల్లో పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు ఇల్లందు మండలంలోని సుదిమల్ల గ్రామపంచాయతీ పరిధిలో గురువారం విస్తృత పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు.గ్రామ సర్పంచ్ కుంజా సుగుణయ్య ఆధ్వర్యంలో హనుమంతుల పాడు, సుదిమల్ల, కొత్తూరు గ్రామాల్లో బ్లీచింగ్ చల్లించి పరిశుభ్రత చర్యలు చేపట్టారు. గ్రామాల్లో ఎక్కడా నిల్వ నీరు ఉండకుండా చర్యలు తీసుకోవాలని, పరిసరాలను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులను నివారించడంలో పరిశుభ్రత కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ గ్రామ పారిశుద్ధ్య నిర్వహణకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి. అజహర్ ,పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లందు సింగరేణి పాఠశాలలో అవగాహన కార్యక్రమం




**తొలి సమయం, ఇల్లందు;జులై, 16:**
డ్రగ్స్ నిషేధం, ట్రాఫిక్ నియమాలు, పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఇల్లందు సింగరేణి ఉన్నత పాఠశాలలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎస్సై కొత్తపల్లి ఉమ మాట్లాడుతూ డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, మైనర్లు వాహనాలు నడపరాదని, ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అలాగే పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో కానిస్టేబుళ్లు విద్యాసాగర్, హనీష్, వాలు, ప్రధానోపాధ్యాయులు డి. పూల్ సింగ్, రవీందర్, ఇన్‌చార్జి హెడ్‌మిస్ట్రెస్ ధనలక్ష్మి, ఏ. శ్రీనివాసరావు, ఎన్‌సీసీ మాస్టర్ రాజా గౌడ్, వెంకటేష్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## బిపిఎల్‌కు తూట్లు పొడుస్తూ..ప్రభుత్వ పథకాలను దోచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు...

**తొలి సమయం డిస్క్ హైదరాబాద్ జూలై 16**
ప్రభుత్వ ఉద్యోగుల భార్యలకు బి పి ఎల్ క్రింద రేషన్ కార్డుల్లో పేర్లను నమోదు చేపించుకుంటూ ప్రభుత్వ పథకాలను అప్పనంగా దోచేస్తున్నారు. వివరాల్లోకి వెళితే జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం అందుకు తండాకు చెందిన చెందిన కొత్త పల్లి రాజయ్య కూతురు సంధ్యారాణికి 2017 సంవత్సరంలొ పరకాల కు చెందిన నేరెళ్ల కృష్ణతొ వివాహం జరిగింది.వివాహం జరిగిన కొద్ది కాలానికి బి పి ఎల్ కింద మంజూరి అయినా రాజయ్య రేషన్ కార్డునుండి సంధ్యరాని పేరును తొలిగించారు. అప్పటికే రాజయ్య అల్లుడు నేరెళ్ల కృష్ణ విద్యుత్ శాఖలొ ప్రభుత్వ ఉద్యోగి కావటంతో రేషన్ షాప్ డీలర్ సమాచారంతో అప్పటి రేవన్యూ శాఖ అధికారులు రేషన్ కార్డు నుండి సంధ్యారాని పేరును తొలిగించారు.అప్పటి వరకు అంత బాగానే వున్న నేరెళ్ల కృష్ణ వక్ర బుద్దిని ప్రదర్శించారు.ప్రభుత్వ పథకాలల్లో సైతం లబ్ది పొందాలన్న దురలోచనతో తన పలుకు బడిన ప్రదర్శించి తన భార్య సంధ్యరాణిని రేవన్యూ అధికారులకు చేతివాటం ముట్టచెప్పి తిరిగి కొత్తపల్లి రాజయ్య రేషన్ కార్డులోనే నేరెళ్ల సంధ్యారాణిగా పేరును అదే పేరుతో చేర్పించి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను పొందుతున్నారు. అంతే కాకుండ ఇటీవల తన భార్యకు రెండు సార్లు కూడ ఆరోగ్య శ్రీ కింద ఆపరేషన్ లు సైతం చేపించి లబ్ది పొందారు.రేషన్ తీసుకోవటం,ప్రతి బతుకమ్మ పండగలకు ప్రభుత్వం పేదలకు అందించే చీరలను కూడ వదులుకోలేదంటే వారు ఏ విధానాన్ని అవాలంబిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.ప్రభుత్వ ఉద్యోగులే ఇలా ప్రభుత్వన్ని, అటు అధికారులను మోసం చేస్తూ లబ్ధిపొందుతుంటే అధికారులు ఏంచేస్తున్నట్టో అర్థంకాని విషయం.నేరెళ్ల కృష్ణ ఇప్పుడు కూడ అధికారులను మేనేజ్ చేస్తున్నట్టు కనిపిస్తుంది.దీంతో రమేష్ అనేవెక్తి పేదలకు అందాల్సిన ప్రభుత్వ పథకాలను అప్పనంగా దోచుకు తింటూ ప్రభుత్వ కొలువు చేస్తూ ప్రభుత్వన్ని మోసం చేస్తున్న నేరెళ్ల కృష్ణ,అయన సతీమణి సంధ్యరాణి పై చర్యలు తీసుకోవాలని ఆధారాలతో జిల్లా కలెక్టర్ కు పిర్యాదు చేశారు.

## ఈహెచ్‌ఎస్ అమలయ్యే వరకు పెన్షన్లలో కోత వద్దు

**- రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ( రేవా )**

**సంకా బద్రినారాయణ జిల్లా అధ్యక్షులు**

**తొలి సమయం మహబూబాబాద్ జులై 16**
రాష్ట్రంలో ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్) అమలయ్యే వరకు తమ పెన్షన్లలో 1.5% కోతను వెంటనే నిలిపివేయాలని రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సంకాబద్రి నారాయణ మరియు కిషన్ నాయక్, సోమ గోవర్ధన్ డిమాండ్ చేశారు. దేశంలో ఎక్కడ లేని విధంగా పథకం అమలుగాకముందే ఉద్యోగ ఉపాధ్యాయుల దగ్గర నుండి ప్రీమియంను కట్ చేయడం చాలా దారుణం అని అదేవిధంగా ఇప్పటివరకు కట్ చేసిన వెంటనే చెల్లించాలని , ఈనెల మా పింఛన్ల నుండి తగ్గింపు రద్దు పరిచే ఉత్తర్వులు ఇవ్వాలని అన్నారు. ఇప్పటికే పదవీ విరమణ పొందిన ఉద్యోగులు బకాయిలు రాక అనారోగ్యంతో చనిపోతున్నారని, ప్రభుత్వం ఎప్పటినుంచి ఈహెచ్ఎస్ అమలు చేస్తుందో స్పష్టమైన తేదీలను ప్రకటించిన తర్వాతే పెన్షన్లలో తమ వాటా తీసుకోవాలని కోరారు. వెంటనే ఈహెచ్ఎస్ సమస్యలను గుర్తించి, ఆసుపత్రుల యాజమాన్యాలతో చర్చలు జరిపి పథకం



ప్రారంభించాలని విన్నవించారు, ఈ సమావేశంలో మురళీధర్ స్వామి, చంద్రమౌళి, నిరంజన్ రెడ్డి, ఉమాదేవి , రమాదేవి, కోలా దుర్గయ్య, ఇమామ్, విజయకుమార్, మైసయ్య ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## బీఆర్ఎస్ నేతల అరెస్టులను ఖండించిన సిలివేరి సత్యనారాయణ

**తొలి సమయం, ఇల్లందు;జులై, 16:**
ఇల్లందు, సీతారామ ప్రాజెక్టు పర్యటనకు వచ్చిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు మంత్రులను ప్రశ్నించేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ నేతలను పోలీసులు అరెస్టు చేయడాన్ని ఆ పార్టీ జిల్లా సీనియర్ నాయకుడు సిలివేరి సత్యనారాయణ తీవ్రంగా ఖండించారు.మాజీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు పిలుపు, మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ ఆదేశాల మేరకు మణుగూరుకు వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు సిలివేరి సత్యనారాయణతో పాటు గిన్నారపు రాజేష్, కాసాని హరిప్రసాద్ యాదవ్, మీర్జా బేగ్, ఎస్.కె. చాంద్ పాషా, రవికాంత్, బాసిని రాములు, పూదూరి లక్ష్మీనారాయణ, నీలం రాజేష్‌లను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారని తెలిపారు.ఈ సందర్భంగా సిలివేరి సత్యనారాయణ మాట్లాడుతూ, రైతుల సమస్యలపై ప్రశ్నిస్తే అరెస్టులు, నిర్బంధాలు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు.



సీతారామ ప్రాజెక్టు, రైతు రుణమాఫీ, రైతు బీమా, జిల్లాలో అభివృద్ధి అంశాలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అరెస్టులతో బీఆర్ఎస్ గొంతును అణచలేరని, రైతుల పక్షాన తమపోరాటంకొనసాగుతుందనిస్పష్టం చేశారు.

## బీఆర్ఎస్ పాలన స్వర్ణయుగం..

**- కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి నిలిచిపోయింది:**

**మాజీ ఎమ్మెల్యే డి.ఎస్. రెడ్యా నాయక్**

**తొలి సమయంమరిపెడ జూలై 16**
తెలంగాణ రాష్ట్రాన్ని గత పదేళ్లలో మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దిందని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర అభివృద్ధి పూర్తిగా మందగించిందని మాజీ ఎమ్మెల్యే డి.ఎస్. రెడ్యా నాయక్ విమర్శించారు.ఆయన మాట్లాడుతూ, బీఆర్ఎస్ పాలనలో వ్యవసాయం, సాగునీరు, తాగునీరు, సామాజిక సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధి వంటి అన్ని రంగాల్లో తెలంగాణ గణనీయమైన పురోగతి సాధించిందన్నారు. రైతు బంధు పథకం ద్వారా రైతులకు పెట్టుబడి సాయం అందించి వ్యవసాయ రంగానికి కొత్త ఊపిరి పోశామని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా లక్షల ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీటిని అందించే కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేశామన్నారు.ఆసరా పింఛన్లు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి సంక్షేమ పథకాల ద్వారా పేద, బడుగు, బలహీన వర్గాలకు ఆర్థిక భరోసా కల్పించామని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమాన్ని సమన్వయం చేస్తూ తెలంగాణను దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా నిలబెట్టిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని ఆయన అన్నారు.ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయిందని రెడ్యా నాయక్ ఆరోపించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలులో తీవ్ర జాప్యం జరుగుతోందని, అవి ఇప్పుడు ప్రజల దృష్టిలో ఆరు గ్యారెంటీలు కాదు.. ఆరు అబద్దాలుగా మారిపోయాయని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తూ ప్రజలను నిరాశపరుస్తున్నారని అన్నారు.రాష్ట్ర పాలనలో సమన్వయం, పారదర్శకత కొరవడిందని, ఖజానా ఖాళీ అయిందనే సాకుతో అభివృద్ధి పనులను నిలిపివేస్తున్నారని ఆయన ఆరోపించారు. గత ప్రభుత్వం నిర్మించిన వ్యవస్థలను బలోపేతం చేయాల్సిన బదులు వాటిని నిర్వీర్యం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు.రైతుల సమస్యలను పరిష్కరిం



చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, సరైన సమయంలో రైతులకు అవసరమైన సాయం అందడం లేదని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ప్రభుత్వం స్పందించడం లేదని, రాజకీయ కక్షసాధింపే తప్ప రాష్ట్ర అభివృద్ధిపై చిత్తశుద్ధి కనిపించడం లేదని ఆరోపించారు.నిధుల కొరత పేరుతో అభివృద్ధి పనులను నిలిపివేసి, ప్రతి సమస్యకు గత ప్రభుత్వాన్నే బాధ్యులను చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటుగా మారిందని రెడ్యా నాయక్ విమర్శించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగించడం లేదని, అభివృద్ధి ప్రాజెక్టులు నిలిచిపోవడంతో రాష్ట్ర ప్రగతి చక్రం మందగించిందని అన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మాణాత్మక అభివృద్ధికి చిరునామాగా నిలిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం అలసత్వం, వైఫల్యాలకు ప్రతీకగా మారిందని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజల కష్టాలను తీర్చుతామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు అదే ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని అన్నారు. రాష్ట్ర ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో ప్రజలే తగిన తీర్పు ఇస్తారని మాజీ ఎమ్మెల్యే డి.ఎస్. రెడ్యా నాయక్ పేర్కొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చంద్ర శేఖర్ రెడ్డిని పరామర్శించిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



**తొలి సమయం, వనపర్తి, జులై 16**
వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం యాపర్ల గ్రామానికి చెందిన, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చంద్ర శేఖర్ రెడ్డి హైదరాబాద్ మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న వ్యవసాయశాఖ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి శుక్రవారం ఆస్పత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు.ఈ సందర్భంగా శేఖర్ రెడ్డి గారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య



చికిత్సతో త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, అవసరమైన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ముందస్తు అరెస్టులను ఖండించిన సేవాలాల్ సేన



**తొలి సమయం, ఇల్లందు;జూలై, 16:**
ఇల్లందు, గిరిజన నాయకులు, కార్యకర్తలను పోలీసులు ముందస్తుగా హౌస్ అరెస్టు చేయడాన్ని సేవాలాల్ సేన ఇల్లందు మండల అధ్యక్షుడు వాంకుడోత్ రమేష్ పవార్ నాయక్ తీవ్రంగా ఖండించారు.మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రూ.10 వేల కోట్ల భూ కుంభకోణం ఆరోపణలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్న వారిని అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ చేసిన ఆరోపణలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకుండా ప్రజల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు.భూ కుంభకోణంపై నిష్పక్షపాత విచారణ జరిపి, ముందస్తు అరెస్టులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తన వైఖరి మార్చుకోకపోతే గిరిజన సంఘాలతో కలిసి పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో ఆర్థిక లావాదేవీలపై ఆరోపణలు

**పారదర్శకతపై సభ్యుల్లో ప్రశ్నలు**

**తొలిసమయం, హనుమకొండ, జూలై 16:**



గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో ఆర్థిక లావాదేవీల నిర్వహణపై సభ్యుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. హాల్ అద్దెలు, సమావేశాల ద్వారా వచ్చిన ఆదాయం బ్యాంకు ఖాతాలో జమ కాకుండా అటెండర్ వద్ద ఉంచారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సీనియర్ జర్నలిస్ట్ నంబూద్రిపాద్ విడుదల చేసిన ప్రకటనలో, ప్రెస్ క్లబ్‌కు సంబంధించిన నిధుల నిర్వహణలో పారదర్శకత లేదని, సుమారు రూ.3 లక్షల వరకు నగదు అటెండర్ వద్ద ఉన్నట్లు సమాచారం ఉందని పేర్కొన్నారు. కోశాధికారి పాత్రను పక్కనపెట్టి కొందరు నాయకులు ఆర్థిక వ్యవహారాలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు.ప్రెస్ క్లబ్ హాల్ అద్దెలు, మరమ్మతులు, ఇతర ఖర్చుల విషయంలో పూర్తి లెక్కలు సభ్యులకు వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ అంశాలపై గతంలో జిల్లా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.ప్రస్తుతం కోర్టు ఇచ్చిన స్టేటస్ కో ఆదేశాల నేపథ్యంలో కూడా పరిపాలనా వ్యవహారాల్లో మార్పులు జరుగుతున్నాయని, దీనిపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలని కోరారు.

## రిపోర్టర్ శాంసన్ రాజు తండ్రి ఆనందరావు కన్నుమూత

**తొలిసమయం, చుంచుపల్లి, జూలై 16 :**
సీనియర్ రిపోర్టర్ నక్క శాంసన్ రాజు తండ్రి నక్క ఆనందరావు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం రాత్రి మృతి చెందారు. టియుడబ్ల్యూజే - ఐజేయు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు జె. వెంకటరత్నం, జిల్లా కార్యదర్శి జునుమాల రమేష్ ఆనందరావు పార్థివ దేహానికి నివాళులర్పించారు. అనంతరం రిపోర్టర్ శాంసన్ రాజు, కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా వెంకటరత్నం మాట్లాడుతూ శాంసన్ కుటుంబానికి యూనియన్ అండగా ఉంటుందని, తక్షణ సహాయంగా రూ.10 వేలు అందజేసి యూనియన్ సభ్యులందరూ శాంసన్‌కు తోడుగా ఉంటారని హామీ ఇచ్చారు. నివాళులర్పించిన వారిలో జిల్లా ఉపాధ్యక్షులు బాదావత్ శంకర్, నాయకులు రాజేష్, ప్రతాప్, జాన్సన్ డేవిడ్(బాబు), సురేష్, హరి, మురళి, క్రాంతి, రాము, కుమార్, భాష్యం నాని, సూరి, అల్లెపు శంకర్ తదితర జర్నలిస్టులు, ఐజేయు నాయకులు ఉన్నారు.

# గురుకులంలో నీటి కష్టాలు...

**రోడ్డెక్కిన విద్యార్థినులు మంత్రి సీతక్క వెంటనే స్పందన...**

**ఫోన్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి హామీ**

**తొలి సమయం కొత్తగూడ 16 జూలై 2026**
మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రంలోని గాంధీనగర్ గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో నెలకొన్న తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలు తీవ్రరూపం దాల్చడంతో విద్యార్థినులు ఆందోళన బాట పట్టారు. నెలరోజులుగా కనీస వసతులు కల్పించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన విద్యార్థినులు గురుకులం నుంచి రోడ్డుపైకి వచ్చి నిరసన చేపట్టారు. ఈ ఘటన జిల్లాలో కలకలం రేపింది.విద్యార్థినుల కథనం ప్రకారం, పాఠశాల ప్రారంభమై నెలరోజులు గడిచినా తాగేందుకు స్వచ్ఛమైన నీరు అందుబాటులో లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. బాత్రూములు పూర్తిగా దెబ్బతినడంతో వినియోగానికి పనికిరావడం లేదని, మరుగుదొడ్ల తలుపులు లేకపోవడంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పరిస్థితి దారుణంగా ఉండటంతో బహిరంగ ప్రదేశాలకు వెళ్లాల్సి వస్తోందని, అక్కడ పాములు, విషపురుగులు సంచరిస్తుండటంతో ప్రాణభయంతో కాలం గడుపుతున్నామని వాపోయారు.

**పాములు, కీటకాలతో భయం భయంతో పాఠాలు......**
ఇటీవల గురుకుల ప్రాంగణంలో కొండచిలువ కనిపించడం విద్యార్థినుల్లో మరింత భయాందోళనకు గురిచేసిందని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో చదువుపై దృష్టి పెట్టలేకపోతున్నామని, తల్లిదండ్రులు కూడా ఆందోళన చెందుతున్నారని చెప్పారు. కొంతమంది విద్యార్థినులు పరిస్థితులు భరించలేక స్వగ్రామాలకు వెళ్లిపోయినట్లు సమాచారం.

**ఒక్కొక్కరు పది రూపాయల చొప్పున ఇవ్వాలని ప్రిన్సిపాల్ డిమాండ్......**
అంతేకాకుండా బాత్రూముల మరమ్మతుల పేరుతో ఒక్కో



విద్యార్థి నుంచి రూ.10 చొప్పున వసూలు చేశారని, డబ్బులు తీసుకున్నప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదని విద్యార్థినులు ఆరోపించారు. సమస్యలపై ప్రశ్నించిన విద్యార్థులను అంతర్గత మార్కులు తగ్గిస్తామని, బయట ఎవరికీ చెప్పొద్దని కొందరు ఉపాధ్యాయులు బెదిరించారని ఆరోపించారు. ప్రిన్సిపాల్ వ్యవహార శైలి కూడా తమను మానసికంగా వేధించేలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

**అసౌకర్యాలతో విద్యార్థుల కష్టాలు......**
విద్యార్థినులు మరోవైపు విద్యుత్ సమస్య కూడా తీవ్రంగా ఉందని తెలిపారు. కరెంట్ ఎప్పుడు పోతుందో, ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి నెలకొందని, విద్యుత్ అంతరాయాల కారణంగా ఫ్యాన్లు పనిచేయక వేడి భరించాల్సి వస్తోందని చెప్పారు. కొన్ని గదుల్లో ఫ్యాన్లు ఉన్నా అవి పనిచేయడం లేదని, మరికొన్ని ఫ్యాన్లకు రెక్కలే లేకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు.గురుకులంలో నెలకొన్న సమస్యలను పలుమార్లు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడంతో చివరకు రోడ్డెక్కి నిరసన చేపట్టామని విద్యార్థినులు తెలిపారు. విద్యార్థినుల ఆందోళనతో విషయం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క దృష్టికి చేరింది.

**మంత్రి సీతక్క హామీతో ధర్నా విరమించుకున్న విద్యార్థినులు...**
వెంటనే స్పందించిన మంత్రి సీతక్క విద్యార్థినులతో చరవాణి ద్వారా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. తాగునీరు, బాత్రూములు, పారిశుద్ధ్యం, విద్యుత్ తదితర సమస్యలను అత్యవసరంగా పరిష్కరించేలా సంబంధిత అధికారులను ఆదేశిస్తామని హామీ ఇచ్చారు. మంత్రి ఇచ్చిన భరోసాతో విద్యార్థినులు తమ ఆందోళనను విరమించారు.

**ప్రభుత్వం నాణ్యమైన విద్యా కొరకు కోట్లు నిధులు....**
అయితే, ప్రభుత్వం గురుకుల విద్యా వ్యవస్థలో నాణ్యమైన విద్య, మెరుగైన వసతుల కోసం కోట్లాది రూపాయలు వెచ్చిస్తుంటే, కొన్ని విద్యాసంస్థల్లో నిర్లక్ష్య ధోరణి కారణంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది. విద్యాబోధనతో పాటు విద్యార్థుల సంక్షేమం, భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన బాధ్యత విద్యాసంస్థల యాజమాన్యాలపై ఉందని తల్లిదండ్రులు, ప్రజాసంఘాలు అభిప్రాయపడుతున్నాయి. గాంధీనగర్ గిరిజన బాలికల గురుకులంలో నెలకొన్న సమస్యలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు విద్యార్థినులకు తక్షణమే తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, భద్రత వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పెబ్బేరులో శ్రీకృష్ణ తులాభారం



**తొలి సమయం పెబ్బేరు జూలై 16**

పెబ్బేరు ఆషాడ మాసం అంటే శ్రీ మహా విష్ణువుకు అత్యంత ప్రీతికరమైన మాసమని ప్రసిద్ధి. ఆషాడ మాసం సందర్భంగా పెబ్బేరు ఆర్యవైశ్య సంఘం, శ్రీ వాసవి సేవా కమిటీ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలో గురువారం నిర్వహించిన శ్రీ కృష్ణ పూజా వైభవం కనుల పండువగా సాగింది. ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు బుచ్చయ్య శెట్టి ముఖ్య అతిథిగా హాజరు కాగా ఆర్యవైశ్య మహిళా సంఘం జిల్లా కోశాధికారి సంధ్య, రాష్ట్ర కార్యదర్శి కవిత, సభ్యులు హరిత, జ్యోతి, జిల్లా కమిటీ సభ్యులు లక్ష్మీ, లత, గీత, లహరి, భార్గవి ఆధ్వర్యంలో పట్టణంలోని సాయిరాం ఫంక్షన్ హాలులో నిర్వహించారు. శ్రీ కృష్ణుడి పూజా వైభవానికి పట్టణ మహిళలతో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆర్యవైశ్య మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసి అద్భుతమైన ఆధ్యాత్మిక కార్యక్రమంగా రూపు తెచ్చారు. అర్చకులు కిట్టు స్వామి మహిళలతో శ్రీ కృష్ణుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు, అర్చన చేయించారు. అనంతరం స్టేజీపై ఏర్పాటు చేసిన శ్రీ కృష్ణుడి తులాభారం అంగరంగ వైభవంగా జరిగింది. కార్యక్రమానికి హాజరైన భగవద్గీత ప్రవచన కర్త కందికొండ లక్ష్మి మహిళలతో గీతా పారాయణం చేయించారు. ఆ తర్వాత ఆమె భగవద్గీతలోని 12, 15వ అధ్యాయాలపై గీతా ప్రవచనం చేశారు. అనంతరం అర్చకులు శ్రీ కృష్ణుడి ఉత్సవ మూర్తికి మహా మంగళహారతితో నారజనం ఇచ్చి భక్తులకు తీర్థ, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమానికి వచ్చిన భక్తులకు నిర్వాహకులు అన్న ప్రసాద వితరణ చేశారు.

## వనపర్తి జిల్లా కలెక్టర్ ఆఫీస్‌లో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ రివ్యూ




**తొలి సమయం, వనపర్తి, జులై 16**

ఈరోజు వనపర్తి జిల్లా కలెక్టర్ ఆఫీసులో పార్లమెంటు సభ్యులు డాక్టర్ మల్లు రవి అధ్యక్షతన వనపర్తి జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ రివ్యూ చేయడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గారు జిల్లా ఎస్పీ ఆర్ డి ఓ గారు డీఎస్పీ గారు మరియు గౌరవ ఎమ్మెల్యే టుడి మెగా రెడ్డి మరియు వనపర్తి జిల్లా అధికారులు పాల్గొనడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో విజిలెన్స్ కమిటీ మెంబర్ మాదారి భోజరాజు మాట్లాడుతూ జిల్లాలోని దళితులకు సంబంధించిన భూములను ఆక్రమణకు లోను కాకుండా తగు చర్యలు తీసుకోవాలని అలాగే దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టి దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు దళితులపై ఉనుముందు ఎలాంటి అఘాయిత్యాలకు పాల్పడకుండా పోలీసు యంత్రాంగం మరియు రెవెన్యూ అధికారులు మరియు వివిధ శాఖల జిల్లా అధికారులకు ఆయన మనవి చేసుకున్నారు ఇట్లు మాదారి భోజరాజు వనపర్తి జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు మరియు జాతీయ మాలల ఐక్యవేదిక వనపర్తి జిల్లా అధ్యక్షులు.

## ఫాస్ట్ ఫుడ్ బిర్యాని సెంటర్ల తనిఖీ చేసిన ఫుడ్ సేఫ్టీ మరియు మునిసిపాలిటీ అధికారులు..





**తొలి సమయం మహబూబాబాద్ జూలై 16**

మహబూబాబాద్ జిల్లా కేంద్రం మరియు మునిసిపాలిటీ పరిధి సానిటరీ ఇన్స్పెక్టర్ మున్సిపాలిటీ అధికారులు సంయుక్తంగా జిల్లా కేంద్రం లో బస్టాండ్ సెంటర్ లోని ఫాస్ట్ ఫుడ్ మరియు బిర్యాని సెంటర్ల యందు తనిఖీ చేశారు. ఇందులో రెస్టారెంట్ల యందు శానిటేషన్ మరియు హైజినిక్ లేకపోవడంతో మొత్తం 11 రెస్టారెంట్ల యందు తనిఖీలు చేయగా 22,000 రూపాయల జరిమానా విధించి, ఇంప్రూవ్మెంట్ నోటీసులు ఇవ్వడం ఇచ్చారు మానుకోట జిల్లా కేంద్రంలో మునిసిపాలిటీ ఆవిర్భావం జరిగిన కానుండి అడ్డు అదుపు లేకుండా కల్తీ తో కూడిన హోటల్స్ చికెన్ సెంటర్స్ ఫాస్ట్ ఫుడ్ సెంటర్లపై జరిగిన తనిఖీ ఇది మొదటిసారి అనేది గమనార్హం

## మరిపెడ మండల సన్నాహక సమావేశం

**తొలి సమయం మరిపెడ జూలై 16**

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని స్థానిక కనకదుర్గ ఫంక్షన్ హాల్ లో మూడు జాతీయ సంఘాల ఆధ్వర్యంలో సన్నాహాగా సమావేశం జరిగింది, ఈ సమావేశానికి సిపిఐ(ఎం) మండల కార్యదర్శి కామ్రేడ్ గుండ గాని మధుసూదన్ అధ్యక్షత వహించగా శెట్టి వెంకన్న, సమ్మెట రాజమౌళి, బాణాల రాజన్న, లూ మాట్లాడుతూ దేశంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాల్ని అవలంబిస్తుందని అన్నారు, దేశంలో రైతు వ్యతిరేక విధానాలను తీసుకువస్తూ, దేశంలో విచ్చలవిడిగా క్రిమిసంహారక రసాయనాల ఎరువులను ఎక్కువ మొత్తంలో పెంచుతూ కార్పొరేట్ వ్యవస్థకు పట్టం కడుతుందని చెప్పారు, అదేవిధంగా తక్షణమే మూడు విద్యుత్ చట్టాలను తొలగించాలని డిమాండ్ చేశారు, కార్మిక ఉద్యోగ రంగాల్లో ఎంతోమంది ఉద్యోగులు ప్రాణధర్పణ చేసి కార్మిక చట్టాన్ని దశాబ్దాల కాలంగా సాధించుకుంటే వాటిని తొలగించి నాలుగు లేబర్ కోళ్లను తీసుకురావడానికి తీవ్రంగా విమర్శించారు,() మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని తొలగించి, వి బి జి రామ్ జి పథకాన్ని తీసుకువచ్చారన్నారు, దీని ద్వారా 25 రోజుల పని పెరుగుతుందని భూకాఇస్తూ ఉన్నారు, గతంలో కేంద్ర ప్రభుత్వం 90% నిధులను, కేటాయించేది కానీ ఇప్పుడు కేవలం 60% నిధులు మాత్రమే ఇస్తూ, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు 40 శాతం నిధులను కేటాయించాలని డిమాండ్






చేస్తున్నది, ఈ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు, ఈ సన్నాహక సమావేశంలో పాల్గొన్నటువంటి నాయకులు, రైతు సంఘం నుండి తాటికొండ అనంత చారి, తాడూరి వీరేంకులు, నలబోలు లక్ష్మిరెడ్డి, సిఐటియు నుండి సామ్యూల్ మండల కన్వీనర్ కొండ ఉప్పలయ్య, వీరన్న, వ్యవసాయ కార్మిక సంఘం నుండి తూము విజయ్, పూలపాక గణేష్, అల్వాల యాకమ్మ, ఐద్వా మండల కార్యదర్శి దొంతు మమత, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సాంస్కృతిక పండుగ కుమ్మర్ల తొలి బోనం





**తొలి సమయం, వనపర్తి, జులై 16**

మట్టి కుండల ప్రాధాన్యత కుమ్మర్ల తొలి బోనం.... శ్రీ శ్రీ కనకాల కట్ట మైసమ్మ. బోనాల పండుగలో భాగమైన కుమ్మర్ల పాత్ర వర్ణనా తీర్థం..అత్యంత ప్రాచీనమైనది విశిష్టమైనదనే చెప్పుకోవచ్చు తెలంగాణ రాష్ట్రంలో ఆషాఢమాసంలో జరుపుకునే పండుగ కుమ్మర్ల తొలి బోనం...తెలంగాణ రాష్ట్ర కుమ్మరి సంఘం అధ్యక్షులు నడికుడి జయంతి రావు పిలుపు మేరకు గురువారం రోజు ట్యాంక్ బండ్ శ్రీశ్రీ కనకాల కట్ట మైసమ్మ దేవాలయం అమ్మవారి తొలి బోనం పూజ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కుమ్మరి సంఘం నాయకులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు,తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.ఈ సందర్భంగా వనపర్తిజిల్లా కుమ్మరి సంఘం నాయకులు మాట్లాడుతూ,తెలంగాణ రాష్ట్రంలో ఆషాఢమాసంలో జరుపుకునే పండుగ కుమ్మర్ల తొలి బోనం.. భోజనమే... బోనం! మహిళలు.. అట్టహాసంగా లష్కర్ బోనాలు.. తొలి బోనం సమర్పించి తెల్లవారుజాము నుంచే అమ్మవారి ఆలయానికి భక్తులు క్యూ కడతారన్నారు.కుమ్మరి కులస్తులు తయారుచేసిన మట్టి కుండ (బోనం)లోనే అమ్మవారికి నైవేద్యం వండటం, కుమ్మరి మహిళలే తొలి బోనాన్ని సమర్పించడం అనాదిగా వస్తున్న సంప్రదాయమే.. కుమ్మర్ల తొలి బోనం అన్నారు.కుమ్మర్ల తొలి బోనం విశిష్టతకు చాలా ఆదారణ ఉందన్నారు.మట్టి కుండల ప్రాధాన్యత: బోనాలు అనగానే మట్టి కుండలు గుర్తుకొస్తాయి. కుమ్మరులు ఎంతో భక్తిశ్రద్ధలతో ,పవిత్రంగా,ప్రత్యేక కుండలను తయారుచేస్తారన్నారు.తొలి ప్రాధాన్యత: బోనాల ఉత్సవాలు ప్రారంభమయ్యేది వేప ఆకులు,పసుపు, కుంకుమ, వెలిగించిన దీపం అలంకరించబడిన కుండల్లోనే కొత్త బియ్యం, పాలు,బెల్లం వేసి నైవేద్యం వండి తొలి రోజుల్లో, కుమ్మరి సంఘం మహిళలు తయారు చేసిన తొలి బోనాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి,అమ్మవారికి సమర్పిస్తారన్నారు.గ్రామ దేవతలకు (పోచమ్మ, ఎల్లమ్మ) ఆనవాయితీగా సమర్పిస్తారు.చారిత్రక ఘట్టం కుమ్మరి వృత్తి. తెలంగాణ గ్రామ దేవతల సంస్కృతితో ముడిపడి ఉంది. ఆదిశక్తికి సమర్పించే ఈ నైవేద్యంలో మట్టి కుండ వాడటం ప్రకృతికి, సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తుంది.ఆచారాలు ఈ తొలి బోనం సందర్భంగా కుమ్మరి కుటుంబాల సభ్యులు,గ్రామ పెద్దలు కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి,మొక్కులు చెల్లించుకుంటారు.ఈ బోనాల పండుగలో భాగమైన కుమ్మర్ల పాత్ర మన పూర్వీకుల జీవన విధానాన్ని, కులవృత్తుల గొప్పతనాన్ని చెప్పటానికి ఇదే నిదర్శనం అన్నారు.గోల్కొండ, లష్కర్ బోనాలతయారీ విధానం,చాలా గొప్పగా ఉంటుందని కొనియాడారు.బోనాలు అమ్మవారిని పూజించే హిందువుల పండుగ. చెప్పుకోవచ్చు తెలిపారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కుమ్మరి సంఘం నాయకులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి



**-ఆయిల్ ఫామ్ కూరగాయల పంటలు సాగు చేయాలి**

**-వి బి జి రామ్ జి పథకం అమలు చేయాలి**

**ప్రభుత్వ ప్రధాన ముఖ్య కార్యదర్శి సంజయ్ జజూ**

**తొలి సమయం మహబూబాబాద్ జూలై 16**

గురువారం సాయంత్రం హైదరాబాద్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయం నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత అధికారులతో కలిసి త్రాగు నీరు, విద్యా శాఖ, ఆరోగ్యం, ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, సివిల్ సప్లై, ప్రజా పాలన తదితర అంశాలపై ప్రభుత్వ ప్రధాన ముఖ్య కార్యదర్శి సంజయ్ జజూ, వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు, జిల్లా నుండి ఇంచార్జీ అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు హౌసింగ్ పీడీ పురుషోత్తం, సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన ముఖ్య కార్యదర్శి మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఆయిల్ పామ్, కూరగాయలు, పంటలు సాగు చేయాలని, మిషన్ భగీరథ, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణంలో వేగం పెంచాలని, విబిజి రాంజీ పథకం క్షేత్రస్థాయిలో అమలు చేయాలని సూచించారు,

## రిపోర్టర్ శాంసన్ రాజు తండ్రి ఆనందరావు కన్నుమూత



**పార్థివ దేహానికి నివాళులర్పించిన టీయుడబ్ల్యూజే, ఐజేయు నేతలు**

**బాధిత కుటుంబానికి యూనియన్ అండగా ఉంటుందని హామీ**

**తొలిసమయం, చుంచుపల్లి, జూలై 16 :**

సీనియర్ రిపోర్టర్ నక్క శాంసన్ రాజు తండ్రి నక్క ఆనందరావు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం రాత్రి మృతి చెందారు. టీయుడబ్ల్యూజే – ఐజేయు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు జె. వెంకటరత్నం, జిల్లా కార్యదర్శి జునుమాల రమేష్ ఆనందరావు పార్థివ దేహానికి నివాళులర్పించారు. అనంతరం రిపోర్టర్ శాంసన్ రాజు, కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా వెంకటరత్నం మాట్లాడుతూ శాంసన్ కుటుంబానికి యూనియన్ అండగా ఉంటుందని, తక్షణ సహాయంగా రూ.10 వేలు అందజేసి యూనియన్ సభ్యులందరూ శాంసన్ కు తోడుగా ఉంటారని హామీ ఇచ్చారు. నివాళులర్పించిన వారిలో జిల్లా ఉపాధ్యక్షులు బాదావత్ శంకర్, నాయకులు రాజేష్, ప్రతాప్, జాన్సన్ డేవిడ్(బాబు), సురేష్, హరి, మురళి, క్రాంతి, రాము, కుమార్, భాష్యం నాని, సూరి, అల్లెపు శంకర్ తదితర జర్నలిస్టులు, ఐజేయు నాయకులు ఉన్నారు.

## గుమ్మడం గ్రామంలో సర్ ఓటర్ నమోదు ప్రక్రియ పరిశీలన



**తొలి సమయం పెబ్బేరు జూలై 16**

గుమ్మడం గ్రామంలో ఓటర్ నమోదు ఏ విధంగా జరుగుతుంది అనే విషయంపై పరిశీలిస్తు వివరాలు తెలుసుకుంటున్న బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఐఆర్ నియోజకవర్గ ఇన్చార్జి. శ్రీనివాస్ గౌడ్ శ్రీనివాస్ గౌడ్ గుమ్మడం గ్రామ సర్పంచ్ పుట్ట నగేష్ పాల్గొని ఓటర్ల ను ఉద్దేశించి మాట్లాడుతూ భారతీయ పౌరుడైన ప్రతి ఒక్కరికి ఒకే చోట ఓటు ఉండాలని ఎన్నికల సంఘం ఈ నిర్ణయం చాలా హర్షించదగ్గ విషయమని పారదర్శకంగా నిజాయితీగా ఓటు హక్కును వినియోగించుకొని ప్రజాస్వామ్యంలో పరిపాలన చేయడం అనేది గొప్ప విషయం అని ఇంత చక్కటి ప్రజాస్వామ్య దేశం మరి ఏది ఉండదని కావున ప్రతి ఓటరు తమ ఓటు హక్కును కాపాడుకోవాలని ఫాన్స్ ను త్వరితగతిన అందజేయాలని దీనికి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని వారు అన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ జిపిఓ హర్షవర్ధన్ రెడ్డి గారు బి ఎల్ ఓ రాణి బిఎల్ఎ 2 బిజెపి జిల్లా కౌన్సిల్ సభ్యులు . నారాయణ బిజెపి మండల ప్రధాన కార్యదర్శి మొగిలి రఘు కృష్ణయ్య పాల్గొన్నారు.

## హెల్త్ కార్డులు వెంటనే జారీ చేయాలి

**జిల్లా అధ్యక్షులు మిర్యాల సతీష్ రెడ్డి**




**తొలి సమయం మహబూబాబాద్ జూలై 16**

పి ఆర్ టి యు టి ఎస్ మహబూబాబాద్ మండల సభ్యత్వ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షులు మిర్యాల సతీష్ రెడ్డి గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు వెంటనే హెల్త్ కార్డులు జారీ చేయాలని, ఇన్ సర్వీస్ టీచర్లకు ప్రత్యేక టెట్ నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పి ఆర్ టియు ఎల్లవేళలా ఉపాధ్యాయులకు అండగా ఉంటుందని తెలిపారు. సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ పునరుద్ధరణ మరియు పిఆర్సి సాధనకు పిఆర్టియు కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షులు నూకల గీతా రెడ్డి గారు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూక్య రామోజీ నాయక్,కాపరబోయిన సుజాత గార్లు, రాష్ట్ర బాధ్యులు గుగులోతు హల్యా నాయక్,కళ్లెం లక్ష్మిరెడ్డి, మండల, జిల్లా బాధ్యులు కొప్పుల నాగరాజు, సుశీల, విజయ్, భోజన్, సరిత తదితరులు పాల్గొన్నారు

## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని ఎంపిక



**తొలి సమయం కొత్తగూడ 16 జూలై 2026**

గూడూరు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల , లీగలవేణికి చెందిన 8వ తరగతి విద్యార్థిని మిటపెల్లి ప్రీతిక తెలంగాణ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ ఏ ఫారూఖ్ తెలిపారు.ఈ నెల 14న మహబూబాబాద్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వ హించిన జిల్లాస్థాయి అండర్–14 అథ్లెటిక్స్ ట్రయల్స్లో మిడిల్ డిస్టెన్స్ విభాగంలో ప్రీతిక ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించిందన్నారు.ఈ నెల 18వ తేదీన మెదక్‌లోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరగనున్న తెలంగాణ రాష్ట్రస్థాయి మిడిల్ డిస్టెన్స్, లాంగ్ డిస్టెన్స్ అథ్లెటిక్స్ పోటీల్లో ప్రీతిక పాల్గొననుందని అన్నారు.ఈ సందర్భంగా రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థిని మిటపెల్లి ప్రీతికను పాఠశాల ప్రధానోపా ధ్యాయులు ఎస్.ఏ. ఫారూఖ్, పీడీ గొల్లపూడి రాణి, ఉపాధ్యాయ బృందం, గ్రామ సర్పంచ్ దారావత్ రాజు అభినందించి, రాష్ట్రస్థాయిలోనూ ఉత్తమ ప్రతిభ కనబర్చి పాఠశాల, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## శివ చరణ్ రెడ్డి వ్యాఖ్యలను ఖండించిన ఇల్లందు యాదవ సంఘం

**తొలి సమయం, ఇల్లందు;జులై, 16:**

ఇల్లందు యాదవ సంఘం పట్టణ కమిటీ సమావేశం గురువారం ద్వారకా నగర్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో యాదాద్రి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలిగా నియమితులైన శ్రీమతి పోతాబోయిన ఈశ్వరమ్మ యాదవ్‌పై ఇటీవల జక్కిడి శివ చరణ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను యాదవ సంఘం నాయకులు తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈశ్వరమ్మ యాదవ్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు యాదవ సమా జాన్ని అవమానించే విధంగా ఉన్నాయని ఆరోపించారు. జక్కిడి శివ చరణ్ రెడ్డి తక్షణమే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న యాదవులు ఐక్యంగా ఉద్యమించి ఆయన రాజకీయ ప్రస్థానానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.ఈ సమావేశంలో ఇల్లందు యాదవ సంఘం పట్టణ అధ్యక్షుడు మేకల మల్లేష్ యాదవ్, భయ్యా వరప్రసాద్ యాదవ్, కళాశాల శ్రీనివాస్ యాదవ్, పెరుగు కోటేశ్వరరావు యాదవ్, వంగపండ్ల నాగరాజు యాదవ్ ,మద్ది మల్లేష్ యాదవ్, పెరుమల్ల శీను యాదవ్, రాజలింగం యాదవ్, కృష్ణ యాదవ్, వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.